సాక్షి సంగారెడ్డి
శనివారం । 10 । ఆగస్టు । 2024



సంగారెడ్డి ప్రశాంత్ నగర్‌లో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

జిల్లాలో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు ఆలయాలకు చేరుకొని పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో భక్తులతో శివాలయాల్లో సందడి నెలకొంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

న్యూస్‌రీల్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కొండాపూర్(సంగారెడ్డి): చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని డీఈఓ కార్యాలయంలో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్ చదివేందుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు అడ్మిషన్‌కు గడువు ఉందన్నారు. ఆసక్తి గలవారు సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి, ప్రసాద్, శ్రవణ్‌కుమార్, ఖదీర్ పాల్గొన్నారు.

జిల్లా జడ్జి పూజలు



పూజలు నిర్వహిస్తున్న జడ్జి భవానిచంద్ర

సంగారెడ్డి టౌన్: నాగుల పంచమి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శివాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర పూజలు చేశారు. అనంతరం ఆమెను అర్చకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున మహిళలు వచ్చి పుట్టలో పాలు పోశారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



హత్నూరలో మొక్కలు నాటుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న

హత్నూర(సంగారెడ్డి): భవిష్యత్ తరాల కోసం నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న అన్నారు. శుక్రవారం హత్నూర, గోవిందరాజు పల్లి, సిరిపురం గ్రామాలలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, ఎంపీఈఓ యూసుఫ్, ఐబీఏఈ భూపుత్ర, గ్రామ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛదనంతో ఆరోగ్యం



మొక్కనాటి నీరు పోస్తున్న డీపీఓ సాయిబాబా

వట్‌పల్లి(అందోల్): స్వచ్ఛదనం, పచ్చదనంతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం మండలంలోని వట్‌పల్లి, మేడికుందా గ్రామాల్లో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. వీటి నివారణకు నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, మురుగు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఎంపీడీఓ శశిప్రభ, ఎంపీఓ ఖాజా నాసిరొద్దీన్, ఏపీఓ షాయెద్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌పాటిల్, కచూర్‌రావు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమిస్తాం

సంగారెడ్డిటౌన్: రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడుతామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు పెద్దపీట వేస్తూ వ్యవసాయ, పారిశ్రామిక రంగానికి మొండిచేయి చూపించారని నాయకులు ఆరోపించారు.

టీచర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): రెసిడెన్షియల్ పాఠశాలల టైం టేబుల్‌ను సవరించడంతో పాటు ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులివ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి, కంది మండలాల్లోని పలు రెసిడెన్షియల్ పాఠశాలలను, కేజీబీవీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వడంతో పాటు మైనారిటీ రెసిడెన్షియల్స్, మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్స్, ఇతర అన్ని గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలలకు ఒకే రకమైన టైంటేబుల్ ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పి. శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.నరేందర్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో బ్రోకర్లు!

ఆదాయ వనరుగా రుణమాఫీ

- దళారులు చెబితేనే పనులు
- అధికారుల ప్రోత్సాహంతో దందా
- రైతుల నుంచి పెద్దఎత్తున వసూళ్లు



నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ కార్యక్రమం చేపట్టింది. పేద రైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతో ఇటీవల రూ.లక్ష, రూ.1.50లక్షల లోపు రుణాలను మాఫీ చేసింది. ఈ సంబురంలో ఉన్న రైతన్నకు మరో చిక్కు వచ్చిపడింది. బ్యాంకుల్లో పైరవీకారుల జోరు కొనసాగుతుంది. రుణమాఫీ వివరాలు, లోన్ రెన్యూవల్ తదితర పనులు చేయించుకునేందుకు పైరవీకారుల బెడద నుంచి రైతులు తప్పించుకోలేకపోతున్నారు. రైతు నేరుగా బ్యాంకుకు వెళ్లి పనులు చేయించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైరవీకారులు, బ్రోకర్ల ద్వారా వెళ్తే తప్ప బ్యాంకుల్లో పనులు జరగడం లేదు. రైతులకు రాయడం, చదవడం రాకపోవడాన్ని ఆసరా చేసుకొని దళారీలు బరిలో దిగారు. చివరకు విద్యావంతులకు సైతం నేరుగా పనులు జరగకపోవడంతో బ్రోకర్లనే ఆశ్రయించాల్సి వస్తుంది. ఖేడ్ పట్టణంతోపాటు, నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని మెజార్టీ బ్యాంకుల్లోనూ ఇదే తతంగం జరుగుతుంది.

బ్యాంకు తెరవగానే దళారులు ప్రత్యక్షం

ఉదయం బ్యాంకు తెరవగానే ఆయా బ్యాంకు ప్రధాన శాఖల్లో బ్రోకర్లు రంగప్రవేశం చేస్తున్నారు. గ్రామాల్లో ముందుగానే రైతుల వద్ద పాసుపుస్తకాలు, ఇతర వివరాలు తీసుకొని కట్టకట్టుకొని వస్తున్నారు. నేరుగా బ్యాంకు అధికారులకు ఇవ్వడంతో వారు 'పని కానిచ్చేస్తున్నారు'. అయితే లైనులో నిలబడి వచ్చే రైతులకు మాత్రం చుక్కెదురవుతుంది. ఫలానా కాగితాలు, వివరాలు లేవంటూ బ్యాంకర్లు వెనక్కి పంపిస్తున్నారు. దీంతో రైతు ఉసూరు మంటూ వెళ్లి బ్రోకరును కలుస్తున్నారు. ఎంతోకొంత ముట్టజెప్పి పని చేయించుకుంటున్నారు.

పైరవీలకే పనులు

దళారీలు బ్యాంకుల్లో పనిచేయించినందుకు ఒక్కో రైతు నుంచి ఎకరాకు ఇంత అని వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బ్రోకర్లు సైతం బ్యాంకు అధికారుల పేర్లు చెప్పి వసూళ్ళకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. బ్యాంకుల్లో కూడా పైరవీకారులు తెచ్చిన పత్రాల పనులు త్వరితగతిన చేస్తున్నారు. దీంతో వారికి అధికారులతో సత్సంబంధాలు ఉన్నాయేమోనన్న భావనతో రైతులు డబ్బులు వచ్చి పనిచేయించుకుంటున్నారు. బ్రోకర్లు రైతులతో ఖాళీ క్రెడిట్, డెబిట్ ఓచర్లపై సంతకాలు తీసుకుంటుండడంతో ఎంత విత్‌డ్రా చేస్తున్నారో, ఎంత జమ చేస్తున్నారో తెలియడంలేదు.

కాలు కదపని బ్యాంకర్లు..

వాస్తవానికి బ్యాంకు అధికారులు రైతులకు పంట రుణాలు ఇచ్చే ముందు నేరుగా గ్రామానికి వెళ్లి వ్యవసాయక్షేత్రంలో ఏ పంట వేశాడో తెలుసుకొని పరిశీలించాలి. ఫలానా పంటకు ఇంత చొప్పున రుణాలు ఇస్తుంటారు. కానీ బ్యాంకు అధికారులు మాత్రం కార్యాలయం నుంచి బయటకు రావడంలేదు. రైతులకు ఎక్కువ రుణం రావాలంటే ఎంతో కొంత ముట్టజెప్పాలంటూ బేరం కుదుర్చుకుని బ్రోకర్లే ఏదో ఒక పంట నమోదు చేసి ఇస్తున్నారు. వాస్తవానికి క్షేత్రంలో ఒక పంట ఉంటే రుణం మరో పంటకు ఉంటుంది. ఇలా ఉండడం వల్ల పంటలకు నష్టం వాటిల్లిన సందర్భాల్లో పరిహారం అందక రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. గ్రామాల్లో రైతుల రెన్యూవల్స్, బకాయిలు వసూళ్లు చేస్తూ తమకు సహాయకారిగా ఉంటున్నారంటూ కొందరు బ్యాంకు అధికారులు బ్రోకర్లను ప్రోత్సహిస్తుండడంతో వారి ఆగడాలు మితిమీరిపోయాయన్న విమర్శలు వస్తున్నాయి.

> **అలాంటి సమస్య లేకుండా చూస్తాం**
>
> బ్యాంకుల్లో బ్రోకర్ల ప్రమేయం లేకుండా చూస్తాం. ఆరోపణలపై బ్యాంకుల్లో ఇదివరకు విచారణ జరిపాం. నివేదిక రావాల్సి ఉంది. రెండు రోజుల్లో బ్యాంకుకు వచ్చి పరిశీలిస్తా. ఆరోపణలపై విచారణ చేస్తాం. ఇలాంటి సమస్య లేకుండా చేస్తాం.
>
> – సూర్యప్రకాష్, రీజినల్ మేనేజర్, ఎస్‌బీఐ, సంగారెడ్డి జిల్లా శాఖ
>
> **విచారణ జరిపిస్తాం**
>
> బ్యాంకుల్లో పైరవీకారుల ప్రమేయం, డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న విషయంపై విచారణ జరిపిస్తాం. ఇలా జరిగితే చర్యలు తీసుకుంటాం. పైరవీకారులను ప్రోత్సహించం, నేరుగా రైతులకు సేవలు అందిస్తాం.
>
> – రామకృష్ణ, ఏపీజీవీబీ సంగారెడ్డి జిల్లా శాఖ

మొక్కలు నాటడం ప్రతీఒక్కరి బాధ్యత

కలెక్టర్ క్రాంతి



పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో మెడిసిన్ చాట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు/రామచంద్రాపురం: ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. శుక్రవారం 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు మండలం, జీహెచ్‌ఎంసీ పరిధిలోని 112, 113, డివిజన్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అతిథి గృహంలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ... ఇళ్ల నుంచి చెత్తను సేకరించడంలో నిర్లక్ష్యం చేయొద్దని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే విషజ్వరాలు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు రామచంద్రాపురం పరిధిలోని చెరువుల్లో ఆయిల్ బాల్స్ వదిలారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ యాదగిరి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్పనాగేష్ పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల నిల్వ గది, ఇన్‌పేషెంట్ వార్డు, ల్యాబ్ తదితర విభాగాలను పరిశీలించారు. వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఎంఓ ప్రవీణ, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

పెద్ద చెరువు కట్ట పనులు పూర్తి చేయండి



అందోల్ పెద్దచెరువు కట్టపై పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ తిరుపతి కుమార్

జోగిపేట(అందోల్): అందోల్ పెద్ద చెరువు కట్టపై కొనసాగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ ఈఈ తిరుపతి కుమార్ ఆదేశించారు. శుక్రవారం పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. చెరువుకట్టపై ఉన్న మట్టి కొట్టుకుపోకుండా సైడ్‌వాల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కట్టపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ కృష్ణమోహన్, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఉన్నారు.

సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నారాయణఖేడ్: విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత వసతి గృహ భవనంతో పాటు పట్టణ శివార్లలోని జ్యోతిబాపూలే పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఇటీవల మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్న సమయంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆర్డీఓ అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఆనంద్ స్వరూప్ షెట్కార్, శంకర్, శ్రీనివాస్, వివేకానంద్, రవి పాల్గొన్నారు.

జహీరాబాద్, సంగారెడ్డిలో సెట్విన్ శిక్షణా కేంద్రాలు

కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాలతోపాటు వికారాబాద్, తాండూర్, జడ్చర్ల ప్రాంతాల్లో సెట్విన్ నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎంపీపీ, సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లోని ఎమ్మెల్యేలు కాన్సెంట్ ఇవ్వడంతో పాటు స్థలాలను కేటాయించారన్నారు. రెండు నెలల్లోగా వీటిని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతీ ఏడాది యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఈ విషయంలో చాలా ఆసక్తితో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో సంస్థ ఎండీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మల్లెపల్లిలో పర్యటించిన డీఎంహెచ్‌ఓ



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొండాపూర్(సంగారెడ్డి): డ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి శుక్రవారం మండల పరిధిలోని మల్లెపల్లిలో పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పరిశుభ్రతపై అవగాహన కలిగిస్తూ .. సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ఆరా తీశారు. అలాగే గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుకీర్తన, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఏఎన్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తతే ఆయుధం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ, జహీరాబాద్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి జానకీ రెడ్డి సూచించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రేజింతల్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. అక్కడ శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాల భవనాలను తొలగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. అనంతరం ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు లేకుండా చూడాలని ప్రజలు కోరారు. దీంతో విద్యుత్ శాఖ ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు సిద్ధివినాయక ఆలయంలో పూజలు నిర్వహించారు. డీఎల్‌పీఓ అమృత, ఎంపీడీఓ సురేష్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి



ఝరాసంగంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎమ్మెల్యే మాణిక్ రావు సూచించారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఝరాసంగం బీసీ సంక్షేమ వసతి గృహంలో మొక్కలు నాటి నీరు పోశారు. అలాగే మండలంలోని 37 మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

కేతకీలో ప్రత్యేక పూజలు

కేతకీ సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే మాణిక్ రావు నాయకులతో కలిసి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతిపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఇనాష్, ఎంపీడీఓ సుధాకర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, వార్డెన్ శారద తదితరులు పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలంలోని పెద్ద కంజర్ల గ్రామంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాల్య వివాహ, గృహహింస, వరకట్న నిషేధ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

సంగారెడ్డి: విద్యతోనే గిరిజనుల అభివృద్ధి సాధిస్తారని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం గిరిజన సంక్షేమ సంఘం, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జెడ్పీలో జైపాల్ నాయక్ అధ్యక్షత నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులకు ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని, ఏ మూలకైనా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి పుష్పలీల, ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబు నాయక్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ దేవిదాస్, రాంచందర్ నాయక్ పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. శుక్రవారం కేవీపీఎస్ నాయకుల బృందం సంగారెడ్డిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి సమస్యలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నా బెయిల్ ఇవ్వడంతో దాడులు పునరావృతం అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రియల్టర్ల కబ్జాలో ఉన్న అసైన్డ్ భూములను తిరిగి గిరిజన రైతులకు ఇప్పించాలని కోరారు. రామ్మూర్తి నాయక్, అశోక్, అనిల్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యశ్రీ జిల్లాకే గర్వకారణం

అభినందించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నిత్యశ్రీని అభినందిస్తున్న వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: మార్షల్ ఆర్ట్స్ కరాటే అంతర్జాతీయ చాంపియన్‌షిప్–2024లో బంగారు పతకాన్ని సాధించిన నామ నిత్యశ్రీ జిల్లాకే గర్వకారణమని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమెను అభినందించారు. హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో 30 దేశాల నుంచి 3000 మంది బ్లాక్ బెల్ట్ సాధించిన వారు పాల్గొనగా మన జిల్లా నుంచి నిత్యశ్రీ పాల్గొని బంగారు పతకాన్ని సాధించడం సంతోషకరమన్నారు. అనంతరం నగేశ్, దినకర్ మాస్టర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ కరుణశీల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులు తనిఖీ

బియ్యాన్ని పరిశీలించిన అధికారులు



రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): ‘డీలర్లకు బియ్యం కోత’ అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అధికారి ప్రశాంత్, పెద్దశంకరంపేట పౌర సరఫరా గోదాం ఇన్‌చార్జి దత్తురెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు అల్లాదుర్గంలో రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బియ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రేషన్ షాపులకు అధ్వానమైన బియ్యం సరఫరా చేశారని, దీంతో కొంతమంది వినియోగదారులు తీసుకోవడం లేదని డీలర్లు అధికారులకు వివరించారు. ఈ బియ్యాన్ని శాంపిల్ తీసుకొని ల్యాబ్‌కు పంపుతామని టెక్నికల్ అధికారి ప్రశాంత్ అన్నారు. బియ్యాన్ని తిరిగి పంపి మంచి వాటిని తెప్పిస్తామన్నారు. 50 కేజీల బస్తాలో తరుగు వస్తుందని డీలర్లు గోదాం ఇన్‌చార్జికి తెలిపారు.

ఎండు గంజాయి కేసులో..

పదేళ్లు జైలు, రూ.లక్ష చొప్పున జరిమానా



జైలుశిక్ష పడ్డ నిందితులు

నారాయణఖేడ్: ఎండు గంజాయి రవాణా కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్ క్లాస్ అడిషనల్ జడ్జి కె.జయంతి తీర్పునిచ్చారని నారాయణఖేడ్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కంగ్టి మండలం వాసర్ బిబ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ బలరాం, నాగలిద్ద మండలం ఇరక్‌పల్లికి చెందిన జాదవ్ మారుతీ 2015 మార్చి 27న హైచర్ వాహనంలో అక్రమంగా 180 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్నారన్నారు. కల్హేర్ మండలం బీబీపేట మేయిన్ రోడ్డుపై పట్టుకొని కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసుకు సంబంధించి విచారణ జరిపిన జడ్జి ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

1.65 acres of Land on Sale at Neppalli, A.P.2KM from Davuluru toll, 600 m from NH 65,4KM from Kankipadu ✆ 83099 87010 [B-773801]

SERVICES

వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

WANTED

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం 18K ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్స్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నచ్చిన పంటలు సాగు చేయండి

- అన్ని కుల వృత్తులకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం
- త్వరలోనే గౌరవెల్లి, గండిపల్లి ద్వారా సాగునీరు
- భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



పోతారం(జే) గ్రామంలో ఈత, తాటి మొక్కలను నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఒక్క గుంట భూమి కూడా బీడు లేకుండా మునగ, డ్రాగన్, ఆయిల్ పామ్ ఇతర ఏ పంటలైనా రైతన్నలు సాగు చేసుకోవాలని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 75వ వన మహోత్సవంలో భాగంగా అక్కన్నపేట మండలంలోని పోతారం (జే) గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి శుక్రవారం మంత్రి హాజరై ఈత, తాటి మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు రానుందని, మెట్టప్రాంత రైతుల ఏళ్ల కల నెరవేరనుందన్నారు. అదే విధంగా భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అన్ని కులవృత్తుల వారికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని, కార్పొరేషన్లు సైతం ఏర్పాటు చేశామన్నారు. అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా వ్యవసాయ సంబంధిత వాటికి అన్ని రకాలుగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ వాసాల సతీష్, ఎంపీడీఓ భానోతు జయరాం, నాయకులు పాల్గొన్నారు.

మహా ఉద్యమంగా క్విట్ ఇండియా ఉద్యమం

హుస్నాబాద్: మహాత్మాగాంధీ నాయకత్వంలో మహా ఉద్యమంగా క్విట్ ఉద్యమాన్ని చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్విట్ ఇండియా మహత్తర ఉద్యమాన్ని అందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన విధంగా సమాజాన్ని కాపాడుకోవడానికి, మన సమస్యల పరిష్కారం కోసం అలానే వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో రాబోయే కాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కాంగ్రెస్ నాయకులు చిత్తారి రవీందర్, మడప జైపాల్ రెడ్డి, యాదవ రెడ్డి, మైదంశెట్టి వీరన్న, తదితరులు, పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌కని వెళ్లి..

మహిళ అదృశ్యం

పటాన్‌చెరుటౌన్: మహిళ అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని ఇక్రిసెట్ కాలనీకి చెందిన స్వాతి(27) బీరంగూడ పరిధిలోని ఓ సూపర్ మార్కెట్‌లో పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భర్త రాజు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. రాజు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మార్కెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి వ్యక్తి..

న్యాల్‌కల్(జహీరాబాద్): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అరుణ్ కుమార్(23) ఎనిమిదవ తేదీన సాయంత్రం బీదర్ మార్కెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీలకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వెళ్లిపోతున్నానని లేఖ రాసి..

బెజ్జంకి(సిద్దిపేట): వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని రేగులపల్లె శివారులోని వెంకట్రావుపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జాప స్వప్న (38) భర్త లక్ష్మారెడ్డి గతంలో మృతి చెందాడు. ఇద్దరి కూతుర్లకు వివాహం జరుగగా ఇంటి వద్ద ఒక్కరే ఉంటున్నారు. ఈమె తల్లి కనుకలక్ష్మి రెగులపల్లె స్టేజీ వద్ద ఉంటూ ఓ ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తుంది. కూతురు ఒక్కరే ఉంటుండటంతో ప్రతిరోజూ తన పని ముగిశాక ఆమె ఇంటికి వెళ్లేది. శుక్రవారం సాయంత్రం వెళ్లే సరికి స్వప్న కనబడలేదు. తన కోసం వెతుకొద్దని నేను వెళ్లిపోతున్నాని అని స్వప్న రాసిన లేఖ లభ్యమైంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత..



రుక్మిణి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రంలో వివాహిత అదృశ్యమైంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్‌కు చెందిన చెక్కల వెంకటేశ్, రుక్మిణి (32) దంపతులు గురువారం రాత్రి గొడవపడ్డారు. రాత్రి ఇంట్లో నిద్రపోయారు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి రుక్మిణి కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పార్ట్ టైమ్ జామ్ పేరుతో..

రూ.6.50 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తూప్రాన్: ఆన్‌లైన్ జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మరో వ్యక్తి బలి అయ్యాడు. ఎస్‌ఐ శివానందం శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జూలై 16న టెలిగ్రామ్ యాప్‌లో ఆన్‌లైన్ పార్ట్ టైమ్ జాబ్ కింద ప్రొడక్ట్ బిజినెస్ అనే లింకు వచ్చింది. లింకు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లు అడిగిన సమాచారం ఇచ్చాడు. 18వ తేదీ నుంచి వారు చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ.6.50 లక్షలు పంపించాడు. తన బ్యాంకు ఖాతాలో రూ.10 లక్షలు జమైనట్లు గుర్తించిన బాధితుడు వాటిని విత్ డ్రా చేసుకుంటే డబ్బులు రావడం లేదు. మరో రూ.5 లక్షలు పంపిస్తే విత్ డ్రా చేసుకోవచ్చని నమ్మబలికారు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని చింతమడక గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చింతమడక గ్రామానికి చెందిన పెద్దెల్లిగారి జగదీశ్ (23), సుష్మిత దంపతులకు ఇటీవల కూతురు పుట్టి చనిపోయింది. జగదీశ్ మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య తల్లిగారింటికి వెళ్లిపోయింది. కూతురు పుట్టి చనిపోవడం, భార్య అత్తగారింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన జగదీశ్ శుక్రవారం ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

తండ్రిని చంపింది కొడుకే

హత్యను కేసును ఛేదించిన పోలీసులు



నిందితులను పట్టుకున్న పోలీసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వరికోలు గ్రామంలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కన్న కొడుకే మరి కొంత మందితో కలిసి హత్య చేసినట్లు నిర్ధారించారు. పోలీసుల కథనం మేరకు.. తరచూ మద్యం సేవించి అందరితో గొడవలు పడుతూ పరువు తీస్తున్నాడని తండ్రిపై కుమారుడు కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో కొడుకు జావెద్, బామ్మర్ది హాజీబాబ, అతడి సడ్డకుడు ముస్తాఫా, ఆటో డ్రైవర్ అంకుశ్ కూరెల్ల గ్రామంలో అనుమానంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా హత్య తామే చేసినట్టు ఒప్పుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి
- అన్నదాతల ఆవేదనపై రచ్చబండ



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా 8 అంశాలపై హామీలను ఇచ్చి నేడు ఒక్క హామీని అమలు చేయలేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో అన్నదాతల ఆవేదనపై రచ్చబండ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు ఏటా రూ. 12 వేలు అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కలగానే మిగిలాయని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాగే ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పెద్ద ఎత్తున రైతులతో కలిసి ధర్నా కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు. రైతాంగానికి బీజేపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు విభిషన్‌రెడ్డి, ఉమారాణి, తిరుమల రెడ్డి, ఎల్లు రాంరెడ్డి, గురువారెడ్డి, వెంకటరమణ, కుడిక్యాల రాములు, సురేశ్, నత్తి శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌యాదవ్, పంజాల అశోక్‌గౌడ్, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మన్నే శేఖర్, సురేశ్, మహేశ్, వెంకట్రామ్‌రెడ్డి, ఏగొండ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన దొంగలు

- ఐదు ఇళ్లలో చోరీ, మరో ఐదింటిలో చోరీకి యత్నం
- నగదుతోపాటు బంగారం, వెండి ఆభరణాలు అపహరణ
- భయాందోళనలో అంబర్‌పేట గ్రామస్తులు

వర్గల్(గజ్వేల్): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగలు పంజా విసిరారు. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఒకేసారి 10 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి, గ్రామస్తుల కథనం మేరకు.. అంబర్‌పేట గ్రామస్తులు మన్నె స్వామి ఇంట్లో 2 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20,000 నగదు, మన్నె రమేశ్ ఇంట్లో 50 తులాల వెండి, రూ.40,000 నగదు, కోడపర్తి ప్రకాశ్, ఇంద్రసేనారెడ్డి, కుమార్ ఇంట్లో నుంచి తులం బంగారం, 30 తులాల వెండి, రూ.10,000 నగదు దొంగిలించారు. మరో ఐదు ఇళ్ల తాళాలు పగులగొట్టినప్పటికీ ఎలాంటి వస్తువులు చోరీ కాలేదు. తెల్లవారుజామున చోరీ విషయం గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాలను గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీ కెమెరా ఫుటేజీలో అనుమానితుడు..

చోరీ జరిగిన ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులకు అదే గ్రామానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో కనబడ్డాడు. ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. అనుమానితుడి ఇంటి నుంచి చోరీకి గురైన కొన్ని బంగారు, వెండి ఆభరణాలు రికవరీ చేసుకున్నట్లు సమాచారం. అతడు పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దుకాణాల తాళాలు పగులగొట్టి..

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో గురువారం రాత్రి రెండు దుకాణాల తాళాలు పగులగొట్టిన దుండగులు నగదు ఎత్తుకెళ్లారు. మణికంఠ ట్రేడర్స్ దుకాణంలో గత నెల ఇదే తేదీన చోరీ జరుగగా, సరిగ్గా నెల రోజులకు లక్ష్మీ ట్రేడర్స్ దుకాణంలో సుమారుగా రూ.50 వేల నగదును దుండగులు అపహరించుకపోయారు.

జీడిపల్లిలో చోరీ

మనోహరాబాద్(తూప్రాన్): ఊరెళ్లిన వారి ఇంటిలో బంగారం, వెండి చోరీ చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. జీడిపల్లి గ్రామానికి చెందిన గుండు ఉమా గురువారం ఊరికి వెళ్లి శుక్రవారం ఇంటికి రాగా గుర్తు తెలియని దొంగలు పడ్డారు. బీరువాలో పావుతులం బంగారం, 60 తులాల వెండి, చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గౌరవెల్లి ప్రాజెక్టుపై సీసీ కెమెరాలు మాయం

అధికారుల పర్యవేక్షణ గాలికి

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. ఎన్జీటీ ఆదేశాల మేరకు గతంలో సుమారుగా 8 సీసీ కెమెరాలను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్‌ఎంబీ) అధికారులు ఏర్పాటు చేశారు. కొన్ని నెలల కిందట కుందనవానిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కట్టపైకి ఎక్కే వద్ద ఒక సీసీ కెమెరాను ఎత్తుకెళ్లగా, ప్రస్తుతం ఏకంగా నాలుగు సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు

ఎలాంటి పనులు చేపట్టొదని ఏర్పాటు..

గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం 1.41 టీఎంసీలకు అనుమతి ఉండగా దాన్ని 8.23 టీఎంసీలకు పెంచారని, ఇందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని డిమాండ్ చేస్తూ ముంపు గుడాటిపల్లి గ్రామవాసులు, పలువురు భూ నిర్వాసితులు ఎన్జీటీని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రాజెక్టుపై ఎలాంటి పనులు చేయొద్దని, ఎప్పటికీ నిఘా ఉండేలా సోలార్‌తో నిరంతరం పని చేసేలా సీసీ కెమెరాలను అమర్చారు. ఈ ప్రాజెక్టు కట్టపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సీసీ కెమెరాలను ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారు. వెంటనే అధికారులు పర్యవేక్షించి సీసీ కెమెరాలను కట్టపై తక్షణమే ఏర్పాటు చేయాలని ముంపు గుడాటిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి డిమాండ్ చేశారు.



ధ్వంసమైన సీసీ కెమెరా

ప్రకృతిని ఆరాధించే ఎన్‌ఆర్‌ఐ

- 20 రకాలుగా 2,000 మొక్కల పెంపకం
- సేంద్రియ పంటలు, కూరగాయలు సాగు
- 85 ఏళ్ల వయస్సులోనూ జోరుగా వ్యవసాయ పనులు
- మొక్కల చుట్టూ స్వచ్ఛదనం, ఆహ్లాదకర వాతావరణం
- రైతులకు సాయం చేస్తున్న తోటపల్లి గ్రామానికి చెందిన మురళీధర్‌రావు



మామిడి మొక్క నాటి, తోట వద్ద మురళీధర్‌రావు



ప్రకృతి ద్వారం

హుస్నాబాద్‌రూరల్: స్వదేశంలో పుట్టి పెరిగిన వారు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడ్డవారు ఎందరో ఉన్నారు. విదేశాల్లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పుట్టిన ఊరిలో ఉండాలని కొందరు, పుట్టిన ప్రాంతానికి సేవలందించాలని మరికొందరు అనుకుంటారు. ఆ కోవలోనే హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన జనగామ మురళీధర్‌రావు 40 ఏళ్ల కిందటనే అమెరికాకు వెళ్లాడు. కుటుంబం అంతా అక్కడే స్థిరపడినా వృద్ధాప్యంలో పుట్టిన ఊరికి సేవా చేయాలనే ఆకాంక్షతో 2019లో విదేశాల్లో నుంచి తిరిగొచ్చాడు. ఐదేళ్ల నుంచి పుట్టిన ఊరిలోనే ఉంటూ స్థానిక రైతులకు సహాయ పడుతుడూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఊరికి దూరంగా ఉద్యానవనాలు

ఊరికి దూరంగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు సమీపంలో సొంతగా ఉన్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. రెండు ఎకరాల్లో కొబ్బరి, మామిడి, నేరడు, దానిమ్మ, జామ, బొప్పాయి, సపోట, ద్రాక్ష, నిమ్మ ఇలా 20 రకాలకు సంబంధించి 2,000 మొక్కలను పెంచుతున్నాడు. ఉద్యానవనంతో ఆహ్లాదకర వాతావరణం సృష్టించాడు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి వరకు మొక్కల సంరక్షణను దగ్గరుండి చూసుకుంటాడు. పచ్చదనం చోటే స్వచ్ఛదనం ఉండాలని చెట్ల చుట్టూ కలుపు మొక్కలు లేకుండా తీసి వేస్తాడు. ప్రకృతి సృష్టికి ఎంత డబ్బు అయినా ఖర్చు చేసి పల్లె ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించాలనే ఆలోచనతో పచ్చదనం సృష్టిస్తున్నాడు.

సేంద్రియ పంటలే ఆహారం..

మార్కెట్‌లో దొరికే పండ్లు, కూరగాయలను అందరూ వాడుతారు. ఎన్‌ఆర్‌ఐ మురళీధర్‌రావు తన పొలంలో సేంద్రియ పద్ధతిన పండించిన పంటలనే ఆహారంగా తీసుకుంటాడు. 85 ఏళ్ల వయస్సులోనూ రోజు 2 కిలో మీటర్లు నడుస్తాడు. సొంతంగానే కారు డ్రైవింగ్ చేసుకుంటాడు. తన పిల్లలు అందరూ అమెరికాలో ఉన్నప్పటికీ పల్లె ప్రకృతి ఒడిలోనే ఆహ్లాద వాతవరణం దొరుకుతుందని ఇక్కడే ఉంటాడు.

రైతులకు ఆర్థిక సేవలు..

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన మురళీధర్‌రావు రైతులకు సాయం చేయాలని రైతు సేవా సమితి ఏర్పాటు చేశాడు. రైతుల కోసం సంస్థకు తన కుటుంబ సభ్యులతో రూ.4 లక్షల వరకు విరాళం ఇప్పించాడు. అలాగే, ఇతర ఎన్‌ఆర్‌ఐల సహకారంతో రూ.15 లక్షల వరకు సేకరించి రైతులకు రుణాలు ఇప్పిస్తున్నాడు. రైతు సేవా సమితి ద్వారా రైతులకు ఒక్కొక్కరి రూ.50 వేల నుంచి లక్షల వరకు రుణాలను ఇప్పించి పాల ఉత్పత్తిని పెంచుతున్నాడు. ఆర్థిక అవసరాలు తీరడంతోపాటు గ్రామంలో రైతు సేవా సమితి ఆర్థిక ప్రగతి సాధనకు పరోక్షంగా పునాదులు వేశాడు.

పుట్టిన ఊరికి సేవ చేయాలని..



కొబ్బరి తోటలో..

పల్లెటూరులో వ్యవసాయ కుటుంబాల కరువు కష్టాలను చూసి ఉద్యోగం చేయాలని పిల్లలను వ్యవసాయానికి దూరంగా ఉంచాలని ఊరు విడిచి వెళ్లిన. 40 ఏళ్ల కిందనే కొడుకు, కూతురు కుటుంబాలు అమెరికాలోనే స్థిరపడ్డారు. నేను 2018 వరకు 30 ఏళ్లు అమెరికాలోనే చిన్న ఉద్యోగం చేశాను. ఐదేళ్ల కిందటే సొంత ఊరికి రావాలని వ్యవసాయ రైతులకు సహాయం చేయాలని వచ్చాను. 5 ఏళ్లుగా 2,000 మొక్కలు పెంచాను. ప్రతీ ఏటా కొన్ని మొక్కలు తెచ్చి నాటుతాను.

– జనగామ మురళీధర్‌రావు, ప్రవాస భారతీయుడు

పేకాట రాయుళ్ల అరెస్టు

18 మందిపై కేసు నమోదు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలం ఎర్రారం గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న వారిని శుక్రవారం అరెస్టు చేసి జోగిపేట కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు జోగిపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9వేల నగదు, పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన సుధాకర్, పీ.మల్లేశం, అశోక్, లింగయ్య, యాదయ్య, గంగయ్య, మొగులయ్య, పోచయ్య, నరేశ్, యాదాగౌడ్, మల్లేశం, టీ.కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే, వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్‌లోని డెయిరీ ఫామ్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు పెద్దాపురం సాయిలు, పెద్దగొల్ల సాయిలు, కలాలి శ్రీనివాస్‌గౌడ్, బీ.యాదయ్య, పల్లె శబ్బీర్ మియా, దాసరి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్‌ఐ విఠల్ తెలిపారు.

విధులకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరి నారాయణ(28) రెండేళ్ల కిందట బతుకుదెరువు కోసం వచ్చి పాశమైలారంలో ఉంటున్నాడు. ఇక్కడే పారిశ్రామిక వాడలోని మెటల్ క్రాఫ్ట్ కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం డ్యూటీకి వెళ్లిన హరి నారాయణ పరిశ్రమలోని పెయింటింగ్ రూమ్‌లో కేబుల్ వైర్ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.